

బదిలీల జాగారం

టీచర్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియ రాత్రి నుంచి ఉదయం 5 వరకు కొనసాగడంతో జాగారం చేస్తూ అవస్థలు పడ్డారు. - 10లో



జడ్పీలో బదిలీలకు సన్నద్ధం

జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు జాబితా రూపొందించారు.. - 10లో



సదరం పాట్లు

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం పునఃపరిశీలన కార్యక్రమంలో వసతులు లేక ఇబ్బందులు పడ్డారు. - 10లో

చతికిల బడి



నాడు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు



నేడు

పాలసముద్రం ఆముదాల జెడ్పీ హైస్కూల్లో ఇంటి నుంచి బాక్సుతో విద్యార్థులు



కూటమి ఏడాది పాలనలో విద్యా రంగం చతికిల బడింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధుల్లేక ట్యాప్‌లు సైతం మరమ్మతులు చేయని దుస్థితి. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తు..సర్కారు బడులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది. ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థుల చదువులు ఏడాదిగా భారంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన విద్యా సంక్షేమ పథకాలను కూటమి సర్కారు నిర్వీర్యం చేసి పేద విద్యార్థులను చదువులకు దూరం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కనీవిని ఎరుగని రీతిలో అమ్మ ఒడి, విద్యాదీవెన, ట్యాబ్‌లు, విదేశీవిద్య, వసతి దీవెనలాంటి ఎన్నో పథకాలు అమలు చేసింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది విద్యారంగానికి పెద్దపీట వేసింది. నేడు కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను బ్రష్టుపట్టించిందని విద్యార్థుల తల్లిదండ్రులు దుమ్మెత్తిపోస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి వేల కోట్లు ఖర్చు
- 'కూటమి'లో కుంటుపడిన విద్యాభివృద్ధి
- విద్యార్థులకు దూరమైన పథకాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక అప్పులు



- ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు కవిత. కూలీ పనులు చేస్తూ కుమార్తె శరణ్యను చదివిస్తోంది. గతంలో సమయానికి ఏటా అమ్మఒడి ఇస్తుండడంతో ఎలాంటి కష్టం ఉండేది కాదని చెబుతోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తామని చెప్పి మోసగించారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తల్లికి వందనం పథకం అమలై ఉంటే తన కుమార్తె చదువుకు అప్పు చేయాల్సిన దుస్థితి వచ్చేది కాదని వాపోతోంది.

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT



- ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు భారతి. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద కుమారుడు చరణ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండో కుమారుడు కిషోర్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. కూటమి ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పడంతో ఆ పథకం సహాయం అందుతుందని ఏడాది పాటు ఎదురు చూసింది. ఎదురు చూపులు చూసి ఆమె పిల్లలకు ఏడాది మొత్తం విద్యాసంవత్సరం పూర్తి అయిపోయిందని అంటోంది. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఎగ్గొట్టడం ఎంత వరకు సబబు అని ఆమె ప్రశ్నిస్తున్నారు.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 2019వ సంవత్సరానికి ముందు సర్కారు బడులపై తల్లిదండ్రులకు చిన్నచూపు ఉండేది. 90 శాతానికి పైగా తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపే మొగ్గు చూపించేవారు. అలాంటి పరిస్థితులను అధిగమించి 2019 సంవత్సరం నుంచి 2024 ఎన్నికల వరకు గత వైఎస్‌ఆర్‌సీపీ సర్కారు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. గత ఐదేళ్ల పాలనలో కనుమరుగైన సర్కారు బడులకు ఊపిరి పోసింది. పథకాల అమలుతో జిల్లాలోని 2436 ప్రభుత్వ పాఠశాలలతో పాటు లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది.

కూటమి పాలనలో విద్యారంగం వెనుకంజ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో విద్యావ్యవస్థ అట్టడుగు స్థాయిలోకి పడిపోయింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై సర్కారుపై నమ్మకం కోల్పోయారు.

గతంలో సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్

జిల్లాలో ఉన్నత విద్య చదివే విద్యార్థులెవ్వరికీ ఇబ్బందులు లేకుండా ఏటా సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. ప్రతి 3 నెలలకొకసారి, త్రైమాసికం అయిన వెంటనే విద్యార్థుల తల్లులకు డబ్బులిచ్చి వారి చదువులకు తోడుగా నిలిచారు.

టీడీపీ పాలనలో ఫీజుల కోసం అప్పులు

జిల్లా వ్యాప్తంగా 91,320 మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారు. వీరందరికి కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించడం లేదు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తూ బయటకు పంపేస్తున్న ఘటనలు పలుచోట్ల జరుగుతున్నాయి. ఫలితంగా తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 24,149 మంది విద్యార్థులకు రూ.44.76 కోట్ల వరకు నిధులు విడుదల చేయాల్సి ఉంది.

మౌలిక వసతులకు అందని నిధులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించి 2467 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు చేసుకోవాలన్నా హెచ్‌ఎంల వద్ద చిల్లిగవ్వ లేని దుస్థితి ఏర్పడింది.

నాడు–నేడు కింద వైభవం


గత ప్రభుత్వం నాడు–నేడు పథకంలో ఎంపికైన బడులకు జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదటి దశ పనుల్లో 743 పాఠశాలలకు రూ.150.24 కోట్లు, రెండవ దశలో 1210 పాఠశాలలకు రూ.449.80 కోట్లను గత వైఎస్‌ఆర్‌సీపీ సర్కారు ఖర్చు చేసింది. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు లేక విద్యార్థులు ఇళ్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితిని మార్చేశారు. సర్కారు బడులను ప్రైవేట్ బడులకు దీటుగా రూపురేఖలు మార్చింది.

అమ్మఒడి చిత్తూరు నుంచే..

2019లో సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ పథకాన్ని మొట్ట మొదటి సారిగా చిత్తూరు జిల్లా నుంచే ప్రారంభించారు. 2020వ సంవత్సరం జనవరి 9 వ తేదీన చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో అమ్మ ఒడి పథకాన్ని ప్రారంభించారు. మొత్తం అయిదేళ్ల కాలంలో అమ్మఒడి పథకంలో 6,99,404 మంది విద్యార్థులకు మేలు చేకూర్చారు.

గత ప్రభుత్వంలో విద్యార్థులకు ట్యాబ్‌లు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే పేద విద్యార్థులకు 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి డిసెంబర్ 21వ తేదీన ఉచితంగా ట్యాబ్‌లను అందజేశారు. రెండు సంవత్సరాల్లో 62,425 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యాబులను పంపిణీ చేశారు.



నాడు-నేడుతో రూపురేఖలు మారిన కత్తెరపల్లి జెడ్పీ హైస్కూల్



తిరుపతిలో నాడు-నేడు పనులు ఆగిపోవడంతో అధ్వాన్నంగా శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాల తరగతి గది

కూటమి ప్రభుత్వంలో ట్యాబ్‌లు నిషేధం

ఈ విద్యా సంవత్సరంలో ఎప్పటి లాగే డిసెంబర్ 21వ తేదీన ట్యాబ్‌లు ఇస్తారని ఎనిమిదో తరగతి చదువుతున్న 48,241 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆశపడ్డారు. కాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో గతంలో ఇచ్చిన ట్యాబులను సైతం వినియోగించకుండా చేస్తోంది. అదే విధంగా సర్కారు బడుల్లో సీబీఎస్ఈ, ఐబీ(ఇంటర్నేషనల్ బేసిక్ కరిక్యులమ్) సిలబస్‌ను తొలగించింది.

తల్లికి వందనం ఎక్కడ ?

గత ప్రభుత్వం ఇచ్చిన విధంగానే టీడీపీ సర్కారు తల్లికి వందనం అనే పేరును మార్చారు. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పథకం అమలు చేస్తామని హామీలు గుప్పించారు. ఇప్పటికి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 1,58,085 విద్యార్థులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

పిల్లల చదువు భారంగా మారింది



నాభర్త లోకేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు. అందరూ ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి వచ్చేది. దీంతో పిల్లల చదువుకు ఇబ్బంది లేకుండా ఉండేది. ఈ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఎంత మంది ఉంటే అందరికి అమ్మఒడి అన్నారు. పోనీ ఇంకా బాగుంటుందని అనుకున్నా. కానీ ఎవరికీ సాయం లేకుండా పోయింది.

– కస్తూరి, భారత్ నగర్, వీకోట

జిల్లాలోని పాఠశాలలు

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,902	64,519
ప్రాథమికోన్నత	204	45,800
ఉన్నత	330	30,898
మొత్తం	2,436	1,41,217

జిల్లా వివరాలు..

(గత ఐదేళ్లల్లో జిల్లాలో విద్యాభివృద్ధి పథకాలు, లబ్ధి)

పథకం పేరు	లబ్ధిపొందిన వారి సంఖ్య	ఖర్చు చేసిన మొత్తం(రూ.కోట్లలో)
ఉచిత ట్యాబ్‌లు	1,58,085	316.17
నాడు- నేడు (పాఠశాలలు)	1953	600.04
విద్యాదీవెన, వసతి దీవెన	3,45,879	940.62
గోరుముద్ద	6,99,404	679.25
విద్యాకానుక	6,99,404	134.18
అమ్మఒడి	6,99,404	2497.1

కూటమి ఏడాది పాలనలో నష్టపోయిన విద్యాసంక్షేమ పథకాలు ఇలా..

పథకం పేరు	లబ్ధిదారులు	అవసరమయ్యే నిధులు(రూ.కోట్లలో)
తల్లికి వందనం	2,78,897	418.34
ఉచిత ట్యాబ్‌లు	48,241	144.72
నాడు- నేడు (పాఠశాలలు)	1,213	424
విద్యాదీవెన	24,149	28
వసతి దీవెన	28,978	35
విదేశీ విద్యాదీవెన	20	110

ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలు

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్‌మొత్తం (రూ.కోట్లల్లో)
చిత్తూరు	2517	4.82
నగరి	3444	6.30
పుంగనూరు	4694	8.76
పూతలపట్టు	3006	6.28
పలమనేరు	4252	7.0
కుప్పం	3049	5.04
గంగాధర నెల్లూరు	3187	6.65

ప్రస్తుతం ప్రతిపాదనల్లోనే నిధులు

ప్రస్తుతం జిల్లాలో నాడు–నేడు పనులు చేపట్టని పాఠశాలల్లో మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయాలని కూటమి ఎమ్మెల్యేలు అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నారు. అయినప్పటికీ కూటమి సర్కారు నిధులను మంజూరు చేయడంలేదు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న 7867 మంది ఆయాలకు గత ఎనిమిది నెలలుగా జీతాలు మంజూరు చేయడం లేదు.

తిరోగమనంలో ప్రభుత్వ బడులు



గత ఐదేళ్లలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి. ప్రభుత్వ బడుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదు. గత ఐదేళ్ల పాటు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివిస్తున్నామని గర్వంగా చెప్పుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

– చిట్టి, కొత్తపల్లి, పలమనేరు విద్యార్థి తండ్రి

ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం ఇస్తామన్నారు



నాకు ముగ్గురు పిల్లలున్నారు. ఎంత మంది పిల్లలంటూ అంత మందికి తల్లికి వందనం ఇస్తామన్నారు. ఎక్కడా ఇంత వరకు ఒక్క పిల్లోడికే గతి లేదు. గతంలో జగనన్న ప్రభుత్వంలో వరుసగా ఏటా అమ్మఒడి నగదు అందింది. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా తల్లికి వందనం ఊసే లేదు. – కస్తూరి, భరత్‌నగర్. వి.కోట మండలం

ట్యాబ్‌లు ఇవ్వాలి



గతంలో మా పాఠశాలలో 8వ తరగతి చదివే అక్క, అన్నకు ఉచితంగా ట్యాబ్‌లు ఇచ్చారు. ఆ ట్యాబులు చూసి మాకు సంతోషం వేసింది. ఆ ట్యాబ్‌లో పాఠాలు బాగా చదువుకునేందుకు ఉపయోగంగా ఉన్నాయి. నేను 8వ తరగతికి వెళ్లాక ట్యాబ్ పొందవచ్చని ఆశపడ్డాను. కానీ నా ఆశ నెరవేరలేదు. – నేహశ్రీ, 8వ తరగతి విద్యార్థిని, గుండ్లకట్టమంచి, బంగారుపాళ్యం మండలం

అప్పులు చేసి చదివిస్తున్నా



ఈ ప్రభుత్వంలో నాపిల్లల ఉన్నత చదువుకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మా పాప తిరుపతి లో డిగ్రీ చదువుతోంది. ఇంత వరకు ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయలేదు. ఎప్పుడిస్తారో తెలియలేదు. చేసేదేమిలేక అప్పు చేసి ఫీజులు చెల్లించాం. గత ప్రభుత్వంలో అమ్మఒడి నగదుతో ప్రశాంతంగా చదివించాం. – మోహన్‌కుమారి, విద్యార్థి తల్లి, కార్వేటినగరం

కుటుంబ పోషణ భారంగా మారింది



ఐదు నెలలుగా ఆయాలకు జీతాలు చెల్లించడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. అత్యవసరాలను కూడా కొనలేని పరిస్థితి ఎదురైంది. పాఠశాల, బాత్రూమ్‌లు శుభ్రం చేయడానికి అవసరమయ్యే చీపురు కట్టలు, సోపులు, ఫినాయిల్, గ్లౌజు, కాళ్లకు చెప్పులు అందించడం లేదు. వీటిని ప్రభుత్వం సరఫరా చేయాలి. – లక్ష్మి,ఆయాల సంఘం నాయకురాలు, నగరి

రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు



కూటమి టీడీపీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తూట్లు పొడుస్తోంది. ఫీజు బకాయిలు సకాలంలో చెల్లించడంలో అలసత్వం వహించడం సరికాదు. వేల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. బకాయిలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి

ఒకే ఒక్కడు

చదువుకు ఊపిరి..అమ్మఒడి



చిత్తూరు : 'అమ్మఒడి' ప్రారంభంలో అప్పటి సీఎం జగన్‌కు గులాబీలు అందిస్తున్న విద్యార్థినులు (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : ఆర్థిక పరిస్థితులతో ఏ ఒక్క పేద విద్యార్థి చదువుకు దూరం కాకుండా...పనికి పంపే తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్ని బడికి పంపేలా గత వైఎస్సార్‌సీపీ సర్కారులో అమ్మఒడి పథకానికి శ్రీకారం చుట్టింది. గత ఐదేళ్ల పాటు జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకంను ప్రైవేట్ యాజమాన్యాలతో పాటు ప్రభుత్వ యాజమాన్యాల్లో చదువుతున్న విద్యార్థులకు అమలు చేశారు. పాఠశాల విద్య చదివే విద్యార్థులతో ఆగిపోకుండా ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు చొప్పున ఐదు సంవత్సరాలు జమ చేశారు. విద్యారంగం సంస్కరణలో విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలు అమలు చేసిన పూర్వపు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒకే ఒక్కడుగా ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారు. ఈ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా 6,99,404 మంది విద్యార్థులకు గత ఐదేళ్ల పాటు అమలు చేసి రూ.1049.11 కోట్లను ఖర్చు చేశారు. పథకం లబ్ధి పొందిన లక్షల మంది విద్యార్థులు ప్రయోజకులయ్యారు.

గత ఐదేళ్లల్లో అమ్మఒడి అమలు ఇలా..

నియోజకవర్గం	లబ్ధిపొందిన విద్యార్థుల తల్లులు	ఖర్చు చేసినది (రూ.కోట్లలో)
చిత్తూరు	1,10,045	165.07
గంగాధరనెల్లూరు	98,758	148.14
కుప్పం	98486	147.73
నగరి	94256	141.38
పలమనేరు	90965	136.45
పుంగనూరు	1,09,036	163.55
పూతలపట్టు	97858	146.79

న్యూస్‌రీల్

ఏపీని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజం



నారాయణస్వామి

కార్వేటినగరం : చంద్రబాబు ఏపీని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. శుక్రవారం పుత్తూరులోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార దాహంతో సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఓట్ల కోసం మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ఆరోపించారు. కూటమి పాలనలో రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహానాడు వేదికగా చంద్రబాబు అబద్దాలు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆయన విమర్శలు గుప్పించారు. జగనన్న పాలనకు, చంద్రబాబు పాలన మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు మద్యం, మనీ, మాఫియా, మీడియాను గుప్పెట్లో పెట్టుకుని రాష్ట్రంలో దౌర్జన్య కాండ సృష్టిస్తున్నాడని మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 31వ తేదీన పింఛన్లను పంపిణీ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ నెలకు సంబంధించి జిల్లాలో 2,63,776 మందికి రూ.112.73 కోట్లతో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 31న పింఛన్లు పొందలేని లబ్ధిదారులకు జూన్ 2వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పింఛన్లు అందజేయాలని ఆదేశించారు.

యోగా అలవర్చుకోవాలి



యోగా చేస్తున్న కలెక్టర్, తదితరులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ప్రతి ఒక్కరూ యోగా అలవర్చుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెగా యోగా కార్యక్రమం శుక్రవారం ఉదయం స్థానిక పోలీసు శిక్షణ మైదానం నందు 4 వేల మందితో నిర్వహించారు. యోగా కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారిణి భరణి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ సుధారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జూన్ 1 నుంచి 20 వరకు ప్రతి మండలం, గ్రామంలోనూ యోగాపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మోహన్ కుమార్, ఆర్డీ ఓ.భవాని, జడ్పీసీఈవో రవికుమార్ నాయుడు, ,ఉద్యాన శాఖ డీడీ .మధుసూదన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి గౌరి, అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీ వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీలు గురువారం పలు కారణాలతో వాయిదా వేశారు.ఈ బదిలీలకు ఉమ్మడి చిత్తూరు పరిధిలోని నాన్ టీచింగ్ విద్యాశాఖ ఉద్యోగులు శుక్రవారం డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. అయితే పలు కారణాలతో బదిలీలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.

క్లుప్తంగా

వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల ఎంపిక

తిరుపతి కల్చరల్: వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వివిధ నియోజకవర్గాల నేతలను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాలలో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర యూత్ వింగ్ జోనల్ అధ్యక్షుడిగా పుంగనూరు నియోజకవర్గానికి చెందిన పిట్టా హేమంత్‌రెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరికి చెందిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని, రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శులుగా నగిరికి చెందిన డీ.లోకనాథం, మల్లం రవిచంద్రారెడ్డి(తిరుపతి), ఎస్.కిషోర్(పలమనేరు) నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర యూత్ వింగ్ సహాయ కార్యదర్శులుగా భాగ్యరాజ్ ప్రభంజన్ (కుప్పం), చెంగారెడ్డి(పుంగనూరు), కె.శిధర్‌రెడ్డి(చంద్రగిరి), పి.దొరబాబు(పూతలపట్టు), శిబి చంక్రవర్తి(సత్యవేడు) ఎంపికయ్యారు. రాష్ట్ర వలంటీర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా దిండివరం గణేష్(తిరుపతి), రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా సీఎస్.హరీష్ (పూతలపట్టు) నియమితులైనట్లు పేర్కొంది.

'సదరం' పాట్లు


కుర్చీలు లేక నేలపైనే కూర్చున్న దివ్యాంగులు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం పునః పరిశీలన కార్యక్రమంలో దివ్యాంగులు అవస్థలు పడ్డారు. శుక్రవారం ఆ పరీక్ష కేంద్రం వద్ద వికలాంగత్వ పింఛన్‌దారులు గుమికూడి పునఃపరిశీలన పరీక్ష చేసుకునేందుకు కుస్తీ పట్టారు. ఇటు వైద్యులు, అటూ పింఛన్ దారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడ కూర్చుకోవడానికి సరైన సదుపాయాలు ఏర్పాటు చేయలేదు.

జూన్ 12 వరకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు జేడీ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాలు జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కరకంబాడి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జిల్లాలోని 15 మండలాల్లో రైతులకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. తొలి దశలో వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు, నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో చేపట్టే కార్యక్రమాల్లో రైతులకు సాంకేతిక యాజమాన్యాలు పద్ధతులు, ప్రకతి వ్యవసాయ పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలు తెలియజేయనున్నట్లు జేడీ వివరించారు.

ఎన్‌ఎస్‌యూ డీఈ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ దూర విద్యాకేంద్రం ఆధ్వర్యంలో పలు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.రంగనాథన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సంస్కృతంలో ఆరు నెలల వ్యవధి సర్టిఫికెట్ కోర్సు, ఏడాది వ్యవధి డిప్లొమో, రెండు సంవత్సరాల వ్యవధి పాక్‌శాస్త్రి కోర్సులు ఉన్నాయని తెలియజేశారు. ఈ కోర్సులకు ఆసక్తిగల వారు వచ్చేనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440626562 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మామిడి విలవిల


చిత్తూరు మార్కెట్‌లో కుప్పలు పోసిన బేనీషా

- దిగజారుతున్న ధరలు
- అల్ఫోన్సో ధర పతనం
- కోతలు వద్దంటున్న ట్రేడర్‌లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : మళ్లీ మామిడి ధరలు పతనమయ్యాయి. బేనీషా ధర మరింత పతనానికి చేరుకుంది. ఇదే దారిలో అల్ఫోన్సో ధరలు పయనిస్తోంది. చందూర ధర దారుణంగా పడిపోయింది. కాయలను కొనేవారు లేక మార్కెట్‌లో కాయలు నిల్వలు పేరుకుపోయాయి.. దీంతో ట్రేడర్లు కోతలు వద్దని రైతులను నిలుపుదల చేయిస్తున్నారు. చిత్తూరు నగరం కట్టమంచిలోని మామిడి కాయల మార్కెట్ వెలవెలబోతోంది.

గత నాలుగు రోజులుగా మార్కెట్‌కు కాయలు రాకపోవడంతో వ్యాపారం డల్‌గా మారింది. శుక్రవారం 5 నుంచి 6 టన్నుల కాయలు వచ్చాయి. ఇందులో అధికంగా బేనీషా కాయలు ఉన్నాయి. ఈ బేనీషా మార్కెట్‌లో విక్రయాలు జరగక ట్రేడర్లు కుప్పలు పోసి పెట్టారు. రైతులకు కోతలు వద్దని నిలుపుదల చేసినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. కాగా ఇమామ్ పసంద్ ధరలు మాత్రం గిట్టుబాటు అవుతోంది. మిగిలిన టేబుల్ రకాల ధరలు మాత్రం పతనమవుతున్నాయి. ఇలా అయితే రైతుకు కోత కూలి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ధరలు ఇలా...

మామిడి రకం	ధర (రూ.లలో)
బేనీషా	10–20
చందూర	4–6
తోతాపురి(టేబుల్ రకం)	12
కాలేపాడు	20–30
మల్లిక	20–30
ఇమామ్ పసంద్	50–60
అల్ఫోన్సో	20–30

మొక్కుబడిగా పౌర హక్కుల దినం

– దళిత సర్పంచ్‌కు అవమానం


మొక్కుబడిగా సమావేశం నిర్వహించి ఫొటోకు పోజులిస్తున్న తహశీల్దార్

చౌడేపల్లె : పౌర హక్కుల దినం సమావేశం పరికిదొన దళితవాడలో శుక్రవారం మొక్కుబడిగా నిర్వహించారు. పరికిదొన సర్పంచ్ లక్ష్మీదేవి దళిత సర్పంచ్ అయినప్పటికీ ఆమెకు కనీస సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ హనుమంతునాయక్ గ్రామానికి చేరుకొని పౌరహక్కుల దినం మమ అనిపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతినెలా చివరి శనివారం సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఒక రోజు ముందుగానే అధికారులు సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటని దళిత సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి దళిత నాయకులు, పోలీసుశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో సమావేశం నిర్వహించాల్సి ఉండగా వీరెవరు హాజరుకాలేదు. అయినప్పటికీ తహసీల్దార్ దళితవాడలోని మహిళలు, వృద్ధులతో సమావేశం ముగిసిందని మినిట్స్ రాయించి చేతులు దులుపుకున్నారని సంఘం నేతలు ఆరోపణలు చేశారు. అధికారులే దళిత హక్కులను కాలరాస్తూ అన్యాయం చేస్తున్నారని అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రెడ్డెప్ప , సర్పంచ్ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

జెడ్పీలో బదిలీలకు సన్నద్ధం

- సీఈఓ పరిశీలనకు అర్హుల జాబితా
- నేడు జెడ్పీ చైర్మన్ అనుమతికి పంపనున్న దస్త్రం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగుల బదిలీలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లా, మండల పరిషత్ సహా అనుబంధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జాబితా ఇప్పటికే పూర్తి స్థాయిలో రూపొందించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అర్హుల జాబితా ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ యాజమాన్యం పరిధిలో పనిచేస్తున్న వారిలో 138 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. వీరిలో ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారు 48 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే రిక్వెస్ట్ బదిలీల కోసం ఏకంగా 90 మంది దరఖాస్తు చేసుకున్నారు. అటెండర్లలో 29 మంది ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకోగా బదిలీల కోసం 26 మంది దరఖాస్తు చేసుకున్నారు.


ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైల్ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసుల వద్దకు శనివారం పంపనున్నారు. ఆయన పరిశీలించి ఆమోదం తెలిపిన తరువాత బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.

తరగతుల రద్దు చెల్లదు

- డీఈఓ, ఆర్జేడీలను వివరణ కోరిన హైకోర్టు
- హాకింగ్ స్కూల్ కరస్పాండెంట్ హఫీజ్


మాట్లాడుతున్న హాకింగ్ కరస్పాండెంట్ హఫీజ్

కుప్పంరూరల్ : హాకింగ్ పాఠశాలలో స్టేట్ సిలబస్‌కు చెందిన 8, 9, 10 తరగతుల రద్దు విషయంలో న్యాయమే గెలిచిందని కుప్పం హాకింగ్ ఇంటర్ నేషనల్ స్కూల్ కరస్పాండెంట్, కుప్పం మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు హఫీజ్ అన్నారు. గత శుక్రవారం తమ పాఠశాలలో స్టేట్ సిలబస్‌కు చెందిన 8, 9,10 తరగతులు రద్దు చేస్తూ డీఈవో ఆదేశాలు ఇచ్చారన్నారు. ఏకపక్షంగా వ్యవహరించిన విషయంపై తాము హైకోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. కోర్టు గురువారం విచారణకు స్వీకరించి ఒకే ఒక్క వాదనలోనే తరగతుల రద్దు విషయం చెల్లదని తేల్చి చెప్పారన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే తరగతులు రద్దు చేశారని ఆరోపించారు. జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తాను చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయడమే ఇందుకు కారణంగా చెప్పుకొచ్చారు. వారం రోజులుగా విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఎంతగానో మద్దతుగా నిలిచారన్నారు. తమకు స్టేట్ సిలబస్ అనుమతులు ఉన్నా సీబీఎస్‌సీ సిలబస్‌పైనే 1 నుంచి 10 వరకు తరగతులు సాగిస్తున్న విషయం తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని కోరారు.


కోర్టు తీర్పు కాపీ

ప్రాణం తీసిన ఈత సరదా

– నీట మునిగి ఇద్దరు చిన్నారుల మృతి


అవినాష్


సిద్ధు

యాదమరి : ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..చిత్తూరు మండలం తుమ్మిండపాల్యంకు చెందిన సదా కుమారుడు సిద్ధు(11), తమిళనాడు రాష్ట్రం సామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ కుమారుడు అవినాష్ (13) మండల పరిధి కీనాటంపల్లి పంచాయతీ కోయూరులోని తన అమ్మమ్మ ఇంటికి వేసవి సెలవులకు వచ్చారు. శుక్రవారం గ్రామానికి సమీపంలో ఉన్న కొత్తచెరువు కుంట వద్ద సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ముందుగా కుంటలోకి దిగి ఆడుకుంటున్న చిన్నారి సిద్ధు మునిగిపోవడంతో ఒడ్డున ఉన్న అవినాష్ సిద్ధుని కాపాడే యత్నంలో బురదలో కూరుకుపోయి మృత్యువాత పడ్డారు. ఇది గమనించిన అటువైపుగా వెళ్తున్న కొందరు స్థానికులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వస్తే ఇలా మృత్యుఒడికి చేరుకోవడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

ఒక రోజు హెడ్‌మాస్టర్లు


శ్రీదేవి


సుధారాణి

చిత్తూరు కలెక్టరేట్ : సర్వీస్‌లో చేరినప్పటి నుంచి హెడ్‌మాస్టర్ కావలన్నది ప్రతి టీచర్ కల. అలాంటి కల ఎన్నో ఏళ్ల తర్వాత ఇద్దరు టీచర్లకు నెరవేరింది. కానీ ఆ కల ఒక రోజుకు మాత్రమే మిగిలింది. చిత్తూరు జిల్లాలోని కుప్పం మండలం ఓల్డ్ పేట్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీదేవి, తిరుపతి జిల్లాలోని తిరుపతి అర్బన్ మండలం జెడ్పీ పద్మావతిపురం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌గా విధులు నిర్వహిస్తున్న తిమ్మసముద్రం సుధారాణి ఒక రోజు హైస్కూల్ హెచ్‌ఎంలుగా విధులు నిర్వహించనున్నారు. ఈ ఇద్దరు టీచర్లు ఈ నెల 31 వ తేదీన ఉద్యోగ విరమణ పొందుతున్నారు. వీరికి ఈ నెల 29 న హైస్కూల్ హెచ్‌ఎం గా ఉద్యోగోన్నతి లభించింది.

బదిలీల జాగారం


రాత్రి సమయంలో కౌన్సెలింగ్ కేంద్రంలో టీచర్ల పడిగాపులు

- ఉదయం 5 గంటల వరకు కొనసాగిన ఉద్యోగోన్నతులు
- టీచర్లు, విద్యాశాఖ అధికారులకు రాత్రంతా జాగారమే

చిత్తూరు కలెక్టరేట్ : ఇటు విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అటు ఉద్యోగోన్నతులు పొందుతున్న టీచర్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ జాగారంగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని హైస్కూల్ హెచ్‌ఎం పోస్టులకు గురువారం రాత్రి చిత్తూరు డీఈవో కార్యాలయం పక్కనున్న గవర్నమెంట్ హైస్కూల్ లో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉద్యోగోన్నతులు పొందుతున్న టీచర్లను సాయంత్రం 4 గంటలకు హాజరు కావాలని ఆదేశించారు. అయితే రాత్రి 9.30 గంటల వరకు కౌన్సెలింగ్‌ను ప్రారంభించని పరిస్థితి. ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలు, ఎస్సీ, ఎస్టీ టీచర్ల ఉద్యోగోన్నతులు కోటా చూపకపోవడం , పలువురి పేర్లు జాబితాలో కనిపించకపోవడం వంటి సమస్యలతో కౌన్సెలింగ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో డీఈఓ వరలక్ష్మితో పాటు ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్, సూపరింటెండెంట్లు, సిబ్బంది రాత్రంతా విధులు నిర్వహించారు. వీరితో పాటు ఉద్యోగోన్నతులకు హాజరైన ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలు మండలాల టీచర్ల రాత్రంతా కౌన్సెలింగ్ కేంద్రంలోనే జాగారం చేశారు. చిన్నపిల్లలతో హాజరైన మహిళలు ఇబ్బందులు పడ్డారు. దూరప్రాంతాల నుంచి విచ్చేసిన టీచర్లు అర్ధరాత్రి సమయంలో బస్సులు లేక బస్టాండ్ వద్దే పడిగాపులు కాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 186 మంది స్కూల్ అసిస్టెంట్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలకు హైస్కూల్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ ఉద్యోగోన్నతులు తమకొద్దు అంటూ 25 మంది టీచర్లు లిఖిత పూర్వకంగా అధికారులకు రాసిచ్చారు. ఈ ప్రక్రియలో పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు స్వామి కణ్ణన్, జీవీ రమణ, గిరిప్రసాద్ రెడ్డి, బాలాజీ, సాంబిరెడ్డి, గంటామోహన్, మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భార్యను మోసం చేసి.. మరోపెళ్లి చేసుకున్న భర్తకు జైలు


పోలీసుల అదుపులో నిందితుడు

చిత్తూరు అర్బన్ : భార్య బతికుండగానే.. ఆమెను మోసం చేసి, మరో యువతిని పెళ్లాడిన భర్తకు ఏడాది జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ చిత్తూరులోని న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఉమాదేవి కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన పి.విజయ కుటుంబ సమస్యల కారణంగా తవణంపల్లె మండలం వడ్డిపల్లె గ్రామంలో నివాసం ఉంటున్నారు. బంగారుపాళ్యం మండలం సదకుప్పంకు చెందిన హేమంత్‌కుమార్ (28) విజయను పెళ్లి చేసుకుని, నాలుగేళ్ల కాపురం చేశాడు. తరువాత తన భార్యకు తెలియకుండా మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీనిపై 2020 ఆగస్టులో విజయ పోలీసులకు ఫిర్యాదు చేయగా, బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదుచేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. ఇరుపక్షాల వాదనలు విన్న చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు.. హేమంత్‌కుమార్ చేసిన పనిని తప్పుపట్టింది. విజయను మోసం చేసి రెండోపెళ్లి చేసుకున్నందుకు నిందితుడికి ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమాదేవి తీర్పునిచ్చారు. అనంతరం నిందితుడిని చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

ఆగేది రామాపురమే!

- బుల్లెట్ ట్రైన్‌కు జిల్లాలో ఒక్కటే స్టాపింగ్ పాయింట్
- మైసూరు–చెన్నై మార్గానికి భూసేకరణకు సిద్ధం
- జిల్లాలో 41 రెవెన్యూ గ్రామాల మీదుగా లైన్


బైరెడ్డిపల్లి మండలంలో జిల్లాలోకి ప్రవేశించనున్న మార్గం ఏరియల్ శాటిలైట్ సర్వే మ్యాప్

పలమనేరు : చెన్నై– మైసూరు బుల్లెట్ ట్రైన్ మార్గానికి సంబంధించి ఫీల్డ్ వర్క్ అండ్ ప్రిపరేషన్ ఆఫ్ డీటైల్డ్ సోషియల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎస్‌ఐఏ), రీ సెటిల్‌మెంట్ యాక్షన్ ప్లాన్ (ఆర్‌ఏపీ)లను వెంటనే సిద్ధం చేయాలని ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ (నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్) జీఎం నిశాంత్ సింఘాల్ నుంచి జిల్లా కలెక్టర్‌కు తాజాగా ఆదేశాలందాయి. మైసూరు నుంచి చెన్నై దాకా 463 కిలోమీటర్ల దూరం వెళ్లే ఈ మార్గం చిత్తూరు జిల్లాలోని పలమనేరు, బంగారుపాళెం, చిత్తూరు నియోజకవర్గం మీదుగా 77 కి.మీ మేర వెళ్లనుంది.

జిల్లాలో 41 గ్రామాల్లో వెళ్లనున్న మార్గం

కర్ణాటక నుంచి బైరెడ్డిపల్లి మండలంలోని కంభంపల్లి, ఆలపల్లి, జీసీపల్లి, లక్కనపల్లి, శెట్టిపల్లి, బేలుపల్లి, అంకింవారిపల్లి, అయ్యంరెడ్డిపల్లి, గుండ్లపల్లి, కొలమాసనపల్లి, మొరం, జల్లిపేట, కూర్మాయి, పలమనేరు, సముద్రపల్లి, పెంగరగుంట, పూతలపట్టు నియోజకవర్గంలోని మొగిలి, టేకుమంద, గొల్లపల్లి, రాగిమాను పెంట, బోడబండ్ల, కూర్మాయిపల్లి, చిత్తూరు నియోజకవర్గంలోని బుడితిరెడ్డిపల్లి, యాదమరి, పెరియంబాడి, జంగాళపల్లి, మాధవరం, మాపాక్షి, 190 రామాపురం, కొత్తపల్లి, వసంతాపురం, బసవపల్లి, పసుమంద, కుప్పిగానిపల్లి, రాగిమాను పట్టిడల మీదుగా తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. ఈ గ్రామాల్లో 876 మంది రైతుల భూములను సేకరించనున్నారు.

జిల్లాలో ఒక్కటే..

మైసూరు నుంచి చెన్నై దాకా మొత్తం తొమ్మిది చోట్ల స్టాపింగ్‌లున్నాయి. ఇందులో కర్ణాటక రాష్ట్రంలో 5, తమిళనాడులో 3 చోట్ల బుల్లెట్ ట్రైన్ ఆగనుంది. చిత్తూరు జిల్లాలో మాత్రం 190–రామాపురం వద్ద మాత్రమే చిత్తూరు జిల్లా స్టాపింగ్‌గా పెట్టారు.

గంజాయి స్వాధీనం


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడిపాల : గంజాయి స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా.. ఒడిసా రాష్ట్రం, బద్రాక్ జిల్లాకు చెందిన అశోక్‌దాస్ అనే అతను గంజాయి తీసుకొని గొల్లమడుగు చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్నాడని సమాచారం అందిందన్నారు. వెంటనే గుడిపాల తహసీల్దార్ జయంతికి సమాచారం అందించామన్నారు. సంఘటనా స్థలానికి తహసీల్దార్‌తో పాటు పోలీసులు వెళ్లి అరెస్ట్ చేసి విచారించగా గాజులపల్లెలోని సాంబా గ్రానైట్ ఫ్యాక్టరీలో ఆరు నెలల నుంచి పనిచేస్తున్నట్లు తెలిపాడు. తన గ్రామానికి వెళ్లి వచ్చేటప్పుడు బద్రాక్ జిల్లాలో గంజాయిని ఒక కిలో రూ.3 వేలకు కొని ఇక్కడ రూ.20 నుంచి 30 వేల రూపాయలకు అమ్ముతున్నట్లు చెప్పాడన్నారు. అతడి వద్ద నుంచి సుమారు 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఆర్‌ఐ రమాసాయి, వీఆర్‌ఓ నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.

తగ్గిన పాల ధరలు

- వర్షాల కారణంగా పెరిగిన పాల ఉత్పత్తి
- రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గుదల

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో వర్షాల కారణంగా పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా పాల ధరలు పడిపోయాయి. లీటర్‌పై రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గుముఖం పట్టింది. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ధరలు పతనమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

నేడు లీటరు రూ.33

ఏప్రిల్‌కు ముందు రోజు వారీగా 12 లక్షల నుంచి 15 లక్షల లీటర్ల పాల సేకరణ జరిగేది...ప్రస్తుతం 19 లక్షల లీటర్లకు పుంజుకుంది. ఇలా పాల ఉత్పత్తి పెరగడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాల ధరలు పడిపోయాయి. ఏప్రిల్‌లో పాల మధ్యస్థ ధర లీటర్ రూ.35.50 ఉండగా నేడు రూ.33కు పడిపోయింది.

- ప్రస్తుతం డెయిరీల నుంచి డీలర్లకు విక్రయించే పాల ప్యాకెట్ లీటర్ ధర రూ.65.40 ఉంది. డీలర్లు ప్రజలకు అమ్మే ఎమ్మార్పీ ధర రూ.72 నుంచి రూ.74 ఉంది. అయితే ధరలు తగ్గుముఖం పడితే ఆ ధరలను తగ్గించకుండా డెయిరీలు పాడి రైతులు, ప్రజలను మోసం చేస్తున్నాయి.

వర్షానికి నేలకూలిన వృక్షం

– ముగ్గురికి తీవ్ర గాయాలు




గాయపడిన గోవిందస్వామి, రత్నవేలు, యశ్వంత్


విరిగిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షం ముగ్గురిని ఆసుపత్రి పాలు చేసింది. నగరంలో రాత్రి 45 నిమిషాల పాటు వర్షం కురిసింది. పలమనేరు రోడ్డులో చెట్టు కింద ఉండగా ఉన్నపలంగా చెట్టు రోడ్డుపై కూలిపోయింది. ఆ సమయంలో కింద పడ్డ చెట్టు కొమ్మ తగిలి చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లికి చెందిన రత్నవేలు, నగరంలోని మిట్టూరుకు చెందిన యశ్వంత్, తమిళనాడులోని వేలూరుకు చెందిన గోవిందస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు స్థానికులు రోడ్డుపై చెట్టును తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులేకుండా చేశారు.

బంతి విలాపం




ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా వరకు రైతులు పూలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా బంతి పూల సాగుకు అవసరమైన పద్ధతులు పాటించి అధిక దిగుబడుల సాధిస్తున్నారు. కానీ ధరలు లేక దిగాలు చెందుతున్నారు. కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బంతి పూల సాగు చేసిన రైతులు పంట కోతకు ఉపక్రమించారు. బంతి పూలు అధికంగా దిగుబడి ఉన్నప్పటికీ మార్కెట్‌కు చేరుకునే సరికి మద్దతు ధర లభించకపోవడం శోచనీయం.

– సాక్షి ఫోటోగ్రాఫర్ తిరుపతి